
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.6, కనిష్ఠం 20.4
కామారెడ్డి
జిల్లా వార్తలు
3
ఆదివారం 8 డిసెంబరు 2024



ఇందిరమ్మ ఇళ్ల యాప్‌పై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన

కామారెడ్డి టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల యాప్‌పై కార్యదర్శులకు ఎంపీడీవో రఘురాం అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్క లబ్ధిదారుడు 400 స్కేర్‌ఫీట్‌కు తక్కువ కాకుండా నిర్మించుకోవాలని తెలిపారు. గ్రామాల ప్రజలకు ప్రతీ ఒక్కరికి అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అపర్ణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ పోరుకు.. కసరత్తు!

- ఎన్నికల ఏర్పాట్లలో పంచాయతీ అధికారులు
- తాజాగా పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల
- జిల్లాలో 4,697 పోలింగ్ కేంద్రాల గుర్తింపు
- పోలింగ్ కేంద్రాల తుది జాబితా ఈనెల 17న విడుదల
- ఇప్పటికే ఓటరు జాబితాను ప్రకటించిన అధికారులు
- జిల్లాలో 535 జీపీలు, 4,686 వార్డులు
- ఇందులో 6.36 లక్షల మంది ఓటర్లు
- పల్లెల్లో రిజర్వేషన్లపై చర్చ

కామారెడ్డి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను సంక్రాంతి తర్వాత నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. జిల్లా యంత్రాంగం, పంచాయతీ శాఖ అధికారులు సైతం జిల్లాలో ఎన్నికలపై ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. ఇదివరకే పంచాయతీ ఎన్నికల్లో భాగంగా వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 535 జీపీలు ఉండగా 4,686 వార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 6.36 లక్షల ఓటర్లు ఉన్నారు. ఇదిలా ఉండగా శనివారం పోలింగ్ కేంద్రాలను పంచాయతీ శాఖ గుర్తించింది. జిల్లా వ్యాప్తంగా 4,697 పోలింగ్ కేంద్రాలను గుర్తించి డ్రాఫ్ట్ జాబితాను విడుదల చేశారు. పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఈనెల 17న విడుదల చేయనున్నారు. జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు నివేదికను జిల్లా పంచాయతీ అధికారులు ఎన్నికల సంఘానికి సైతం నివేదించారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల తేదీ ఎప్పుడు ప్రకటించినా ఎన్నికలు నిర్వహించే ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఓటరు జాబితా విడుదల చేయడం పోలింగ్ కేంద్రాలను సైతం సిద్ధం చేశారు. బ్యాలెట్ పెట్టెల మరమ్మతులు పూర్తి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి పుస్తకాలు జిల్లా పంచాయతీ కార్యాలయంలో, ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది శిక్షణకు అవసరమయ్యే పుస్తకాల సామగ్రి జిల్లాకు చేరుకున్నాయి. తాజాగా శనివారం పోలింగ్ కేంద్రాల జాబితాను పంచాయతీ శాఖ విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా 4,697 పోలింగ్ కేంద్రాలను గుర్తించి డ్రాఫ్ట్ జాబితాను ప్రకటించారు. ఈనెల 10న జిల్లా స్థాయి, 12న మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాలపై సమావేశం నిర్వహించనున్నారు. 7 నుంచి 12 వరకు అభ్యంతరాలు స్వీకరించి 13న వాటిని పరిష్కరించనున్నారు. 17వ తేదీన తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటిస్తారు.

పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో..?

గతంలో జిల్లాలో నిర్వహించిన పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో చేపట్టారు. అదేమాదిరిగా ఈసారి కూడా పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు సంబంధిత శాఖ అధికారులు నివేదిక తయారుచేసి ఎన్నికల సంఘానికి నివేదించారు. మొదటి విడతలో కామారెడ్డి డివిజన్ పరిధిలోని 7 మండలాలైన కామారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, పాల్వంచ, రాజంపేట ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. రెండో విడతలో ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట, తాడ్వాయి, రామారెడ్డి, నిజాంసాగర్, మహ్మద్‌నగర్, పిట్లం, గాంధారి, సదాశివనగర్,మూడో విడతల్లో బాన్సువాడ డివిజన్ పరిధిలోని బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లి, జుక్కల్, పెద్దకొడపగల్ మండలాల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

పల్లె ఓట్లు 6.36లక్షలు

జిల్లాలోని 535 గ్రామ పంచాయతీల పరిధిలో 4,686 వార్డుల్లో కలిపి మొత్తం 6,36,362 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషుల ఓట్లు 3,06,560 ఉండగా మహిళలవి 3,29,787 ఓట్లు, 15 మంది ఇతరుల ఓట్లు ఉన్నాయి. గ్రామాల్లో 650 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. 200ల మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్, ఒక పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 మంది ఓటర్లు ఉండే చోట ఒక ప్రిసైడింగ్, ఇద్దరు పోలింగ్ అధికారులు ఉండనున్నారు. 401-650 మంది ఓటర్లు ఉన్న దగ్గర ఒక ప్రిసైడింగ్, ముగ్గురు పోలింగ్ అధికారులు విధులు నిర్వహించనున్నారు.

(మిగతా 6వ పేజీలో)

నిజాంసాగర్‌కు పూర్వ వైభవం తీసుకువస్తాం



నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద గోల్ బంగ్లాకు మెట్ల ద్వారా వెళుతున్న మంత్రి జూపల్లి



లింగంపేటలో మెట్ల బావిని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి, పక్కన ఎంపీ సురేష్ షట్కార్ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నిజాంసాగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల చరిత్ర కలిగిన నిజాంసాగర్ ప్రాజెక్టుకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటక ప్రమోషన్‌లో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. నిజాంసాగర్‌లో ప్రాచీన కట్టడాలైన గోల్‌బంగ్లా, గుల్‌గస్తి బంగ్లా, వీఐపీ గార్డెన్, స్విమ్మింగ్ పూల్, తదితర కట్టడాలను జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుతో కలిసి పరిశీలించారు. పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను సంబంధిత అధికారులతో చర్చించారు. నిజాంసాగర్ జాలాశయంతో పాటు పరిసరాల ప్రాంతాల అభివృద్ధికి 12 ఎకరాల స్థలాన్ని పర్యాటక అభివృద్ధి సంస్థకు రెవెన్యూ శాఖ అప్పగించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకులకు జలాశయంలో ఆహ్లాదం కోసం బోటింగ్, జలాశయం దిగువన కాటేజీలు, ఉద్యానవనం, చిన్న పిల్లల పార్కు తదితర సౌకర్యాలు అందుబాటులో తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అనంతరం నిజాంసాగర్ హైడ్రో పవర్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల వరప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టు పర్యాటక ప్రదేశాలు అద్భుతంగా ఉందని, వందేళ్లు గడిచినా చెక్కు చెదరలేదని అన్నారు. మూడు కాలాల పాటు నిండుకుండలా ఉన్న నిజాంసాగర్ జలాశయం పర్యాటక అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు త్వరలోనే నూతన పర్యాటక పాలసీ అమల్లోకి తెస్తామని వెల్లడించారు. నిజాంసాగర్ హైడ్రో పవర్ స్టేషన్‌లో 10 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని, త్వరలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించి, దీన్ని పూర్తిగా ఆధునికీకరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, నీటి పారుదల శాఖ అధికారులు, పర్యాటక శాఖ అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

మెట్ల బావిని మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తాం

లింగంపేట: ప్రాచీన కట్టడాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆయన శనివారం లింగంపేట మండల కేంద్రంలోని నాగన్న (మెట్ల బావిని) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బావి కళా నైపుణ్యాన్ని చూసి ఆశ్చర్యపోయారు. 400 సంవత్సరాల క్రితమే ఇంత చక్కటి బావిని నిర్మించిన నాటి కళాకారులను కొనియాడారు. బావిని మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తామని దానికి అవసరమైన నిధులను వెంటనే పర్యాటక శాఖ నుంచి మంజూరు చేస్తానని ఆయన తెలియజేశారు. బావిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మంచి అందమైన పార్కు, కాటేజీలు, మరుగుదొడ్లు నిర్మిస్తామని ఆయన తెలియజేశారు. బావిని మరింత లోతుకు తవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్, మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, మాజీ జడ్పీటీసీ సంతోష్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జొన్నల రాజు, రఫీక్, అట్టెం శ్రీను, సాయికుమార్, కొడ రవి, అశోక్‌లతో పాటు నాయకులు ఉన్నారు.



నాగిరెడ్డిపేటలోని కళాశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా నోడల్ అధికారి షేక్ సలామ్

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తాం

ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం

నాగిరెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తామని ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. ఆయన శనివారం నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ ప్రైవేట్ జూనియర్ కళాశాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలను, మోడల్ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 86 జూనియర్ కళాశాలలు ఉన్నాయని, అందులో 18 ప్రైవేట్ కళాశాలలు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి అన్ని విధాల కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డిసెంబరు 1వ తేదీ నుంచి 95 రోజుల పాటు విద్యార్థులు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపైన ప్రత్యేక శ్రద్ధను తీసుకుంటున్నట్లు తెలిపారు. గత సంవత్సరంలో జిల్లాలో ఇంటర్‌లో 38శాతం ఫలితాలు సాధించగా, ఈ విద్యా సంవత్సరంలో 75 శాతం కంటే అధికంగా ఉత్తీర్ణత సాధించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, బీర్కూర్, బీబీపేట మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సొంత భవనాల నిర్మాణాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన నిజాంసాగర్ పోలీసుస్టేషన్ భవనం

- ఏ క్షణం కూలుతుందోనన్న భయాందోళనలో పోలీసులు
- నాణ్యత లేక.. అధ్వానస్థితికి చేరిన భవనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



5

నిర్మించారు.. వదిలేశారు



- ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానాలు
- కరెంట్ కనెక్షన్, తాగునీటి వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు

5

జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ విజయవంతం



బహుమతిని అందుకుంటున్న విద్యార్థిని

బాన్సువాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ విజయవంతంగా ముగిసింది. బాల శాస్త్రవేత్తలు అద్భుతంగా తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. శనివారం న్యాయ నిర్ణేతలు ప్రాజెక్టులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. విద్యార్థులు పోటీతత్వంతో ప్రాజెక్టులను తయారు చేశారు. రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లో దేశాయిపేటకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. రిపుల్స్ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థులు ప్రీయూష, సాన్విక రెండవ బహుమతి విజేతలుగా నిలిచారు. సింధు విద్యాలయం విద్యార్థులు ప్రవళిక, పూజిత డిసాస్టర్ మేనేజ్‌మెంట్‌లో ప్రతిభను చాటారు. బిచ్కుంద ఆర్యభట్ట పాఠశాలకు చెందిన విద్యార్థులు వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో మొదటి బహుమతిని పొందారు. విజేతలకు జిల్లా అధికారులు, మండల అధికారులు బహుమతులను అందజేశారు.

సైన్స్‌ఫేర్‌ను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు : డీఈవో

బాన్సువాడలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌ను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ జిల్లా విద్యాశాఖాదికారి రాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని జిల్లా స్థాయిలో బహుమతులను అందుకున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ప్రైవేటు పాఠశాలల కృషిని ప్రత్యేకంగా అభినందించారు.

ఆదరాబాదరాగా బీటీ రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు

- పనుల పర్యవేక్షణ కరువు
- నాణ్యతకు తిలోదకాలు



బొగ్గు గుడిసె వద్ద ప్యాచ్ వర్క్ పనులు చేస్తున్న దృశ్యం

నిజాంసాగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీటీ రోడ్డు ప్యాచ్‌వర్క్ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు దేవుడెరుగు. కానీ పనులు చేపట్టే కాంట్రాక్టర్ ఆదరాబాదరగా ప్యాచ్‌వర్క్‌లు చేపడుతున్నారు. ఈ రోడ్డు పనులను రోడ్డు భవనాల శాఖ అధికారులు పర్యవేక్షణ జరపలేకపోతున్నారు. ఫలితంగా ఈ రోడ్డు ప్యాచ్‌వర్క్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జుక్కల్ నియోజకవర్గంలో నిజాంసాగర్ మండల కేంద్రం నుంచి బొగ్గు గుడిసె కూడలి వరకు ఉన్న రెండు వరుసల రహదారి వెంటనే గుంతలమయమైంది. దీంతో రోడ్డు భవనాల శాఖ అధికారులు నిజాంసాగర్ మండల కేంద్రం నుంచి బొగ్గు గుడిసె వరకు ఉన్న మూడు కిలో మీటర్ల దూరం గల రహదారిలో బీటీ ప్యాచ్ వర్క్‌లు వేసేందుకు నిధులు మంజూరు చేశారు. ప్యాచ్‌వర్క్‌ల పనులను చేపట్టేందుకు నిజామాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. పనులను చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తూ పనులను ముందుకు సాగించడంలో శాపంగా చేశారు. నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జుక్కల్ నియోజకవర్గానికి పర్యవేక్షణకు శనివారం రావడంతో కాంట్రాక్టర్ ఆదరబాదరగా బొగ్గు గుడిసె నుంచి నిజాంసాగర్ వరకు బీటీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను చేపట్టారు. రోడ్డు మధ్య లో పెద్దపెద్ద గుంతలు పడ్డప్పటికీ కాంట్రాక్టర్ వెయిట్ మిక్సింగ్ ద్వారా పూడ్చి వేయాల్సి ఉన్నప్పటికీ కేవలం బీటీ చిప్పింగ్ మిక్స్‌తోనే ప్యాచ్‌లను వేస్తున్నారు. ఈ పనులను ఎప్పటి కప్పుడు రోడ్డు భవనాల శాఖ అధికారులు పర్యవేక్షించి పనులు చూడాల్సిన అప్పటికీ అధికారులు పనులు జరిగే చోట లేకపోవడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ కాంట్రాక్టర్ 2021లో నిజాంసాగర్ మండల కేంద్రం నుంచి సంగారెడ్డి జిల్లా మాసంపల్లి వరకు ఎల్లారెడ్డి, నాందేడ్ రహదారి నుంచి హసన్నపల్లి గ్రామం మార్గంలో హైడల్ పవర్ స్టేషన్, సుల్తాన్‌నగర్ నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టు వరకు దాదాపు 98 లక్షల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు రెన్యువల్ పనులు చేపట్టారు. ఈ పనుల పర్యవేక్షణ రోడ్డు భవనాల శాఖ అధికారులు చేసినప్పటికీ మూన్నాళ్లకే రహదారి అధ్వానంగా మారినా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించారని ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. కానీ రహదారి వెంటనే పెద్ద పెద్ద లోయలు పడ్డ రోడ్డు భవనాలు శాఖ అధికారులు పట్టింపు లేనట్లుగా వ్యవహరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిజాంసాగర్ మండల కేంద్రం నుంచి బొగ్గు గుడిసె వరకు మూడు కిలో మీటర్ల దూరంలో వేస్తున్న బీటీ ప్యాచ్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఉండేటట్లు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బోధన్ కోర్టులో
చట్టాలపై అవగాహన

బోధన్‌రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బోధన్ కోర్టులో శనివారం రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మి నర్సయ్య ఆదేశాల మేరకు కోర్టులో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి భారతీయ నాగరిక సురక్ష సంహిత-2023 గురించి వివరించారు. భారతీయ సాక్ష అధినీయం న్యాయ చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్ రావు, డాక్టర్ పల్నాటి సమ్మయ్య, సీఐ వెంకట నారాయణ, రుద్రూరు సీఐ కృష్ణ, రెంజల్ ఎస్సై సాయన్న, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి గంగాదాస్, బోధన్ ఎక్సైజ్ ఎస్ఐ ఎండీ జలీలుద్దీన్, బోధన్ కోర్టు కానిస్టేబుళ్లు, ఎక్సైజ్ శాఖ కానిస్టేబుళ్లు, సంబంధిత అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు జవహర్ నవోదయ
పాఠశాల మంజూరు పట్ల హర్షం

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాకు మరో జవహర్ నవోదయ పాఠశాల మంజూరు కావడం పట్ల బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి హర్షం వ్యక్తం చేశారు. జవహర్ నవోదయ పాఠశాల మంజూరుకు కృషి చేసిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే నిజామాబాద్, బోధన్ పట్టణాల్లో కేంద్ర విద్యాలయం ఉన్నందున నూతనంగా మంజూరైన జవహర్ నవోదయ పాఠశాలను ఆర్మూర్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ఇక్కడి ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు విజ్ఞప్తి చేశారు.

పిప్రి పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం మండల విద్యాధికారి రాజ గంగారాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన ఎంఈవో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు అనుసరిస్తున్న కార్యాచరణ ప్రణాళికను అడిగి తెలుసుకున్నారు. ఉజ్వల భవిష్యత్ కోసం విద్యార్థులు నిరంతరం శ్రమించి ఉన్నత స్థానాలకు చేరుకొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను
పకడ్బందీగా నిర్వహించాలి

బోధన్‌రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ అన్నారు. శనివారం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై వార్డు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించాల్సిన బాధ్యత వార్డు అధికారులదేనన్నారు. ఎక్కడ పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ, ఏఈలతో కౌన్సిలర్లు, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన అధికారులు

నవీపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రారంభించారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు అధికారులు వెళ్లి వారి వివరాలు సేకరిస్తున్నారు. స్టేషన్ ఏరియాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవ్యశ్రీ ఉన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి


సుబ్రమణ్య స్వామి కల్యాణం


మెండోరలో ఆరట్టులో స్వామిని దర్శించుకుంటున్న సునీల్‌కుమార్

బోధన్‌రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో శనివారం వినాయక్ నగర్‌లో సుబ్రమణ్య స్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య సుబ్రమణ్య స్వామి కల్యాణ వేడుకలను అయ్యప్ప స్వాములతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్గశిర మార్గశుద్ధ షష్ఠి తిథి సందర్భంగా సుబ్రమణ్య స్వామి కల్యాణం కమనీయంగా నిర్వహించామని వేద పండితుడు ఉదయ్ మహరాజ్ తెలిపారు. శరవన భవ అంటూ అభిషేకాలు, కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ మహరాజ్ మాట్లాడుతూ శ్రీవల్లి దేవాసేన సుబ్రమణ్య స్వామి కల్యాణానికి ప్రత్యేకత ఉందని ప్రత్యేకతను వివరించారు. కల్యాణాన్ని తిలకించిన వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలతో పాటు ఆర్థిక బాధలు తొలగి ప్రజల బాధలు తొలగి సకల దోషలు తొలగి శుభాలు కలుగుతాయని భక్తులకు అపార నమ్మకమన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ దంపతులు, రూరల్ సీఐ వెంకట నారాయణ, కౌన్సిలర్ దాము, భక్తులు, అయ్యప్ప స్వాములు, గురుస్వాములు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహన్మాన్ ఆలయ ప్రాంగణలోని అయ్యప్పస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి నిర్మల నగేష్‌శర్మ పురోహితులతో మహా గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామికి అభిషేకాలు, భజన కార్యక్రమాలు నిర్వహించి సుబ్రహ్మణ్యస్వామి జన్మదినం సందర్భంగా షష్ఠి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవ సమితి అధ్యక్షుడు పెంట జలందర్, అఖిల భారత దీక్ష ప్రచార సమితి అధ్యక్షుడు నేముల నవీన్, గురుస్వాములు జనార్ధన్‌గౌడ్, మీసాల రాజేశ్వర్, చేపూర్ ధనుంజయ్, మాసాల సత్యనారాయణ, గోల్డ్ సురేష్, ఖాందేశ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెండోరలో అయ్యప్పస్వామి ఆరట్టు అభిషేకం

మెండోర: మండల కేంద్రంలో అయ్యప్ప దీక్ష స్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆరట్టు అభిషేకం కార్యక్రమాన్ని అయ్యప్ప దీక్ష స్వాములు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆరట్టులో పూలతో అలంకరించి వాహనంపై స్వామివారిని గ్రామ వీధుల గుండా ఊరేగించారు. మహిళల మంగళ హారతులతో అయ్యప్పస్వాముల నృత్యాలు, స్వామియే శరణమయ్యప్ప నామాలతో గ్రామ వీధులు మార్మోగాయి. కోనేరులో స్వామివారి అభిషేకం నిర్వహించారు. ఆరట్టులో స్వామివారిని బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సలీం, పట్టణ అధ్యక్షుడు గుండోజి రవి, గురు స్వాములు మోతె గంగారెడ్డి, సుమో రాజేశ్వర్, కొప్పెల మోహన్, నూత్‌పల్లి శ్రీనివాస్, కొత్తపల్లి రమేష్, వరిగడ్డి రవి, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్గిమల్లన్న స్వామి రథోత్సవం


మల్లన్నస్వామి రథోత్సవాన్ని లాగుతున్న భక్తులు

జక్రాన్‌పల్లి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో శనివారం మల్లన్నస్వామి ఆలయంలో మల్లన్నస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంలో మల్లన్నస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు నందు యాదవ్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండల కేంద్రంలో శ్రీమల్లన్నస్వామి (కండె రాయుడు) కల్యాణోత్సవం వీడీసీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఈనెల 15న మల్లన్నస్వామి మొదటి జాతర, రథోత్సవం నిర్వహిస్తామని, ఈ నెల 22వ తేదీన రెండో రథోత్సవం నిర్వహించనున్నట్టు వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం తెలిపారు.

ఏర్గట్లలో కాంగ్రెస్ నాయకుల సంబురాలు

ఏర్గట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శనివారం సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నేటికి సంవత్సరం పూర్తి కావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నిరంకుశ పాలనకు దొరల అహంకార ప్రభుతానికి స్వస్తి చెప్పి సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనతో, అనేక సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్, గడ్డం జీవన్, బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, మున్కు మోహన్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి

రెంజల్: పేద ప్రజల పెన్నిధి, రైతు బాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోబిన్ ఖాన్ అన్నారు. శనివారం వివిధ గ్రామాలకు చెందిన 25మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఆపదలో ఉన్న వారికి నేనున్నానంటూ భరోసా ఇచ్చే నాయకుడు సీఎం రేవంత్ అని అన్నారు. పేద ప్రజల సంక్షేమమే సీఎం ధ్యేయమన్నారు. శనివారం సాటాపూర్ గ్రామంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ప్రభుత్వం అన్నివర్గాల వారికి సమన్యాయం చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయారెడ్డి, జావీదోద్దీన్, రాములు, ధనుంజయ్, రవి పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలి

భీమ్‌గల్‌రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో బాల్కొండ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా భారీ మెజారిటీతో గెలిచిన చరణ్‌గౌడ్‌ను శనివారం మోర్తాడ్ ప్రజానిలయంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్‌లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన ఉపాధ్యక్షుడు వాక రమేష్, భీమ్‌గల్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్
పోటీలకు కలిగోట్ విద్యార్థిని ఎంపిక

జక్రాన్‌పల్లి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి) జాతీయస్థాయి వాలీబాల్ అండర్-14 విభాగంలో పోటీలకు మండలంలోని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న ఎం.సాన్విక ఎంపికైనట్టు వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి శనివారం తెలిపారు. ఉత్తప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలో ఈనెల 10నుంచి 14వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థిని ఎస్.సాన్విక పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎం.సాన్వికను ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమచారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ, వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయులు, వీడీసీసభ్యులు అభినందించారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ షురూ

నందిపేట, డిసెంబరు 7: మండల కేంద్రంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు సర్వే చేపట్టారు. గతంలో దరఖాస్తు చేసుకున్న ప్రకారం దరఖాస్తుల అధారంగా సర్వే షురూ చేశారు. దరఖాస్తుదారులకు ఇళ్ళు ఉందా లేదా, అర్హులా.. కాదా అనే అంశాలపై స్థానిక పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సర్వే చేస్తున్నారు. ఈ సర్వేను మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి శ్రీనివాస్ రావు, మండల తహశీల్దార్ ఆనంద్ కుమార్ పరిశీలించారు. సర్వే పకడ్బందీగా జరగాలని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు సెల్ ఫోన్ యాప్‌లో లబ్ధిదారుల ఫోటోలను తీసుకున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో ఆకట్టుకున్న విద్యార్థులు

జక్రాన్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి విద్యవైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. శనివారం నిజామాబాద్‌లో జరిగిన విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో చింతలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు సైన్స్ సామాజిక శాస్త్రం, సాంఘికశాస్త్రం, జీవశాస్త్రంకు సంబంధించి ప్రదర్శనను నూతన విదాధాన్ని పొందారు. ప్రధానోపాధ్యాయుడు లచ్చన్న, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధలతో విద్యార్థులకు వివిధ ప్రయోగాలను వివరించి వాటి వెనుక ఉన్న శాస్త్రీయ సిద్ధాంతాలను అవగాహన కల్పించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అనేక ప్రశ్నాలపై స్పష్టత నిచ్చారు. ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు ప్రొత్సాహాన్ని పొందారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

● మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ

బోధన్‌రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బోధన్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో గల దుకాణదారులు తమ అద్దె బకాయిలను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ అన్నారు. అలాగే పట్టణంలోని దుకాణదారులు, ఇంటి యాజమానులు తమ పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల మున్సిపల్ కాంప్లెక్స్‌లో అద్దె చెల్లించని దుకాణాలను సీజ్ చేశారు. దుకాణాల కాల పరిమితి ముగిసిపోయిన ఎవరు ఖాళీ చేయడం లేదన్నారు. కాంప్లెక్స్‌లోని 26షాపులను 25సంవత్సరాలకు లీజుకు ఇచ్చామన్నారు. 2024మార్చితో వీరి గడువు ముగిసిందన్నారు. అయిన దుకాణదారులు ఖాళీ చేయకపోవడంతో అధికారులు షాపులను సీజ్ చేశారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి

● జిల్లా విద్యాధికారి అశోక్


ఆర్మూర్‌లో జిల్లా క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపి రాణించాలని జిల్లా విద్యాధికారి పి.అశోక్ అన్నారు. శనివారం ఆర్మూర్ పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలబాలికల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడను ఎంచుకొని అందులో రాణించేందుకు సాధన చేయాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు సమిష్టి భావన, సమన్వయం పెంపొందుతాయన్నారు. ఆటలు ఆడిన ప్రతీ విద్యార్థికి ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్‌కు దగ్గరవుతారని, క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడిన ప్రతీ సారి గెలుపు కోసం ప్రయత్నిస్తే విజయం మీ సొంతమవుతుందన్నారు. అంతకు ముందు క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజగంగారాం, హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, జిల్లా స్కూల్స్ గేమ్స్ కార్యదర్శి నాగమణి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గంగామోహన్, పీఈటీల సంఘం ప్రధానకార్యదర్శి మల్లేష్‌గౌడ్, సుప్పరి వినోద్, శ్యామ్‌సుందర్ శర్మ, శ్రీనివాస్, బాబురావు, రాజ్‌కుమార్, సుజాత, సంజీవ్, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐపై మంత్రికి ఫిర్యాదు

మద్నూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండల కేంద్రానికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నియోజకవర్గంలోని వైన్స్ యజమానులు బిచ్కుంద సీఐ సత్యనారాయణపై ఫిర్యాదు చేశారు. బిచ్కుంద ఎక్సైజ్ సీఐగా విదులు నిర్వహిస్తున్న సత్యనారాయణ గత కొన్ని నెలలుగా వైన్స్ యజమానులకు ఇబ్బందులు పెడుతున్నారని, ఫిర్యాదులో పేర్కొన్నారు. పర్మిట్ రూమ్‌లు, వైన్స్‌లో పని చేస్తున్న పిల్లలపై కేసులు నమోదు చేస్తున్నారని ఫిర్యాదులు పేర్కొన్నట్లు తెలిపారు. జిల్లా అధికారులకు ఫిర్యాదు అందజేశామని, గత నెల 30న సీఐ వేధింపులకు నిరసనగావైన్స్‌లను మూసివేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 15మందికి గాయాలు

● భయాందోళనలో ప్రజలు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 33, 34, 35, 36వార్డులలో కుక్కల దాడిలో 15మందికి గాయాలు కాగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ం రాత్రి పట్టణంలోని హుస్నాబాద్‌గల్లీలో కుక్కలు చిన్న పెద్ద తేడా లేకుండా రోడ్డు వెంట వెళ్తున్న వారిపై దాడి చేసి గాయపర్చాయి. దీంతో గాయపడ్డ వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు.

● ఒంటరిగా బయటకు వెళ్లాలేని పరిస్థితి

అత్యవసర పరిస్థితుల్లో సైతం ఒంటరిగా బయటకు వెళ్లాలేని పరిస్థితి మున్సిపల్ పరిధిలో నెలకొంది. ప్రతీ వార్డుల్లో రోడ్డు పైన కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఒంటరిగా వెళ్తే దాడులకు పాల్పడుతున్నాయి. శుక్రవారం రాత్రి ఓ మహిళ తన కుమారుడు, కూతురి వెంట తీసుకొని గోల్‌బంగ్లా వైపు వెళ్తుండగా వెనుక నుంచి ఓ కుక్క తన కుమారుడిని కాలుని కారవడంతో ఆమె కేకలు వేయగా పలువురు ఆ కుక్కను తరిమివేశారు. అలాగే హుస్నాబాద్ గల్లీలో ప్రజ్ఞ హైస్కూల్ మూల వద్ద ఓ మహిళ తన కూతురి ఇంటికి వెళ్తుండగా కుక్క దాడి చేసింది. అలాగే దయానంద్‌నగర్‌లో ఓ చిన్నారి తన అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా కుక్క దాడి చేయంతో చేతికి గాయాలయ్యాయి.కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు.

● ఏబీసీ సెంటర్‌కు తరలిస్తున్నాం:రాజు, మున్సిపల్ కమిషనర్

గత పాలకవర్గ సమావేశంలో కుక్కల బెడద తగ్గడానికి రూ.10లక్షల బడ్జెట్‌ను కేటాయించాం. సెప్టెంబర్ నెలలో సుమారు 52కుక్కలను జిల్లా కేంద్రంలోని ఏబీసీ సెంటర్‌కు తరలించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించామని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేద విద్యార్థులకు వరం

● మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 07 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజకవర్గంలోని కౌలాస్ కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. శనివారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుతో కలిసి సందర్శించారు. జుక్కల్ పర్యటనలో భాగంగా కౌలాస్ కోటకు చేరుకున్న మంత్రికి జుక్కల్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుండి మంత్రి జూపల్లి ఎమ్మెల్యే తోట, వివిధ శాఖల అధికారులతో కలిసి కోటపైకి కాలినడకన చేరుకున్నారు. కోటపైకి చేరుకున్న మంత్రికి ఎమ్మెల్యే తోట కోట విశిష్టతను వివరించారు. ఈ కోట 12 శతాబ్దంలో కాకతీయులు నిర్మించారని ఆనాటి నుంచి కోటకు మరమ్మత్తులు లేక శిథిలావస్థకు చేరుకుందని మంత్రికి వివరించారు. అంతేగాక ఈ కోట మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు దగ్గరగా ఉన్నందున ప్రతి నిత్యం ఆయా రాష్ట్రాల నుండి పర్యాటకులు వస్తుంటారని మంత్రికి వివరించారు. కోటలో అద్భుతమైన కళాఖండాలు ఉన్నందున కోటను అభివృద్ధి చేస్తే రానున్న తరాలకు వారసత్వంగా ఈ కోటను అందించేవారమవుతామని ఎమ్మెల్యే మంత్రికి సూచించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రంలో పురాతన కట్టడాలను సంరక్షించే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. కోటలో అపూర్వమైన కళాఖండాలు ఉన్నందున వాటిని రక్షిస్తామని తెలిపారు. దీంతో పాటుగానే కోట అభివృద్ధికి రానున్న రోజుల్లో అన్ని రకాల చర్యలు తీసుకుని ముందుకు వెళ్తామని తెలిపారు, కోటను త్వరలో అభివృద్ధి చేసి పర్యాటక రంగంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. దీనిపై సమగ్ర ప్రతిపాదనలు రూపొందించి తనకు నివేదికలు పంపాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, జిల్లా కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, డిఎఫ్‌వో నిఖిత, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మండల తహసీల్దార్ హిమబిందు, వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్నూర్: మద్నూర్ మండల కేంద్రంలో రూ.305 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, ఎంపీ సురేష్ షెట్కార్, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌లు శంకుస్థాపన చేశారు. అనంతరం మద్నూర్‌మార్కెట్ కమిటీవైస్ చైర్మన్ సౌజన్య ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేఆరు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా యావత్ తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహంలో రాచరిక అనవాళ్ళు లేకుండా తెలంగాణ దృశ్యాన్ని ఆవిష్కరించారని పేర్కొన్నారు. సబ్బండ వర్గాల ప్రజల ఆకాంక్షల స్ఫూర్తిగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్ళు గడిచినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. పదేళ్ల పాలనలో తెలంగాణ వందేళ్ళ విధ్వంసానికి గురైందని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో అక్షరాలా రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారని, దీంతో దశాబ్ద కాలపు నిరంకుశ, దోపిడీ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఆశీస్సులతో రేవంత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యావత్ తెలంగాణ ప్రజలు అలుపెరుగని పోరాటాలతో డిసెంబర్ 7, 2023న తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కొలువు దీరిందని పేర్కొన్నారు. అమరుల ఆశయ సాధనకు ఇందిరమ్మ అడుగు జాడల్లో నడుస్తూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని గుర్తు చేశారు. ఈ దేశానికి, రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీయే శ్రీరామ రక్షగా ఉంటుందని పేర్కొన్నారు. కుల మతాల మధ్య వైషమ్యాలు తొలగించడం మా విధానమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకులాలు అన్నింటినీ కలిపే ఒకే చోట సమీకృత సముదాయాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు మంజూరు ఇవ్వడం జరిగిందని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలనుఅమలు చేస్తుందని ఆరు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిందని తెలిపారు. రైతులు పండించిన సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామని గుర్తు చేశారు. పంట నష్టానికి ఎకరానికి రూ.10 వేల నష్ట పరిహారం ఇస్తున్నామని, త్వరలో నే పంటల బీమా పథకం అమలు చేస్తామని పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అవాస్తవాలను, వాస్తవాలను చిత్రకరించే ప్రయత్నం చేస్తూ ప్రజలను తప్పువోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. బీఆర్ఎస్‌ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులపై అసెంబ్లీ సాక్షిగా చర్చించేందుకు మేము సిద్దంగా ఉన్నామని, అప్పులపై చర్చకు మీరు సిద్ధమా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సవాల్ విసిరారు. రాష్ట్రాన్ని అతలాకుతలం చేసి ఇవాళ్ళ గొప్ప పాలన చేశామని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపన కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తదితరులు పాల్గొన్నారు.


కాలి నడకన కోటకు చేరుకుంటున్న మంత్రి జూపల్లి

దేశ చరిత్రలోనే తెలంగాణలో అతిపెద్ద రుణమాఫీ

మోర్తాడ్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): భారతదేశ చరిత్రలోనే తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద రుణమాఫీ జరిగిందని, ఇప్పటికీ 25లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ జరిగిందని, త్వరలో రూ.2లక్షలకు పైగా రుణాలు కలిగిన రైతులకు రుణామాఫీ అవుతుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం మోర్తాడ్ మండల కేంద్రంలో ప్రజాపాలన విజయోత్సవ సభలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ వరి వేస్తే ఉరి అనుకునే రోజుల నుంచి వరి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తుందని, ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 55వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 ఉచిత గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా అందించామని, దీని వల్ల ప్రతీ కుటుంబానికి రూ.10వేలు ఆదా అవుతుందని ఆయన అన్నారు. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, గురుకులల ఏర్పాటు ద్వారా విద్య వ్యవస్థలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతున్నామని అన్నారు. స్వయం సహాయ సంఘాలకు, పారిశ్రామిక వేత్తలకు రుణాలు ఇస్తున్నామన్నారు. అవినీతి ధరణి పోర్టల్‌ను ఎన్ఐసీ జాతీయ సంస్థకు అప్పగించడం అవినీతికి దూరంగా ఉంచామని తెలిపారన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించామని, రాష్ట్రంలో 4లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, నియోజకవర్గానికి 3500 నుంచి 4500వరకు సీఎం రేవంత్‌రెడ్డి మంవజూరు చేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయంలో కుటుంబ పాలన నడిచిందని, పదేళ్ళలో వారి కుటుంబం మాత్రమే బాగుపడిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేదలకు సంక్షేమం కల్పించడంతో లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు.


మోర్తాడ్‌లో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశంతో నియోజకవర్గ ప్రజలకు బాధ్యతతో సేవలందిస్తున్నానని అన్నారు. నియోజకవర్గంలో గంజాయి, రౌడీయిజం, గుండాయిజం లేకుండా చేశానని సునీల్‌కుమార్ అన్నారు. పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్‌యాదవ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీలు కల్లెడ చిన్నయ్య, గిర్మాజీ గంగాధర్‌లు జిల్లా కార్యదర్శి గిర్మాజీ గోపి, వీడీసీ అధ్యక్షుడు జక్కం అశోక్, పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, ముత్యాల రాములు, డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, సంజీవరెడ్డి, నవీద్, పాటు మహిళలు పాల్గొన్నారు.

నాళేశ్వర్‌లో పొలం విషయంలో ఘర్షణ

● ఇద్దరికి తీవ్ర గాయాలు

నవీపేట,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో శనివారం పొలం విషయంలో ఒకే వంశానికి చెందిన వారు శనివారం ఘర్షణ పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ వినయ్ తెలిపారు. గ్రామ శివారులో ఉన్న ఎస్సారెస్పీకి చెందిన భూమిని సాగు చేసుకుంటున్నారని, భూమి విషయంలో గతంలో నుండి వీరి మధ్యన గొడవలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. శనివారం సైతం పొలం వద్ద కొట్టె హన్మాండ్లు, కొట్టె అర్జున్ కుటుంబాల వారు కర్రలతో దాడులు చేసుకోగా కొట్టె హన్మాండ్లు, కొట్టె అర్జున్‌లకు తీవ్ర గాయాలయ్యాయని, చికిత్స నిమిత్తం బాధితులను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని అన్నారు. ఈ విషయంలో ఇరుపక్షాలకు చెందిన ఫిర్యాదు మేరకు కొట్టె హన్మాండ్లు, కొట్టె అర్జున్‌లతో పాటు మరో 9మందిపై కేసు నమోదు అయిందని ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ స్థలం పరిశీలన

ముప్కాల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలో మంజూరైన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి శనివారం స్థల పరిశీలన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ పరిశీలించారు. గత సంవత్సరం ముప్కాల్ మండల కేంద్రానికి ప్రభుత్వం స్థలం మంజూరైనప్పటికీ అనువైన స్థలాన్ని పరిశీలించారు. పోచంపాడ్ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రాకేష్, క్లస్టర్ ఇన్‌చార్జీ, తదితరులు పాల్గొన్నారు.

భక్తి



ఏర్గట్లలో అయ్యప్ప అభిషేకంలో పాల్గొన్న భక్తులు

ఏర్గట్లలో వైభవంగా

అయ్యప్ప ఆరట్టు పల్లకీ సేవ

ఏర్గట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం సౌడాల వినోద్ గురుస్వామి, అర్చకులు రాకేష్ ఆధ్వర్యంలో అయ్యప్ప ఆరట్టు, పల్లకీ సేవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వారి పల్లకీ సేవను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా అన్నప్రసాదం నిర్వహించగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు





నిజాంసాగర్ పోలీసు స్టేషన్ భవనం

శిథిలావస్థకు చేరిన..

నిజాంసాగర్ పోలీసుస్టేషన్ భవనం

- ఏ క్షణం కూలుతుందోనన్న భయాందోళనలో పోలీసులు
- నాణ్యత లేక.. అధ్వాన్న స్థితికి చేరిన భవనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నిజాంసాగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ పోలీసుస్టేషన్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు భయాందోళనకు గురవుతున్నారు. అయినప్పటికీ పాలకులు, అధికార యంత్రాంగం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2007లో నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్ ప్రారంభమైంది. ఈ భవన సముదాయాన్ని లక్షలాది రూపాయలు వెచ్చించి అప్పట్లో నిర్మాణం చేపట్టినప్పటికీ.. భవన సముదాయాన్ని పిల్లర్లతో నిర్మాణం చేపట్టలేకపోయారు. కేవలం సిమెంట్ ఇటుకలతోనే పోలీస్‌స్టేషన్ భవన సముదాయాన్ని రెండంతస్తుల్లో నిర్మాణం చేపట్టారు. దశాబ్దాల తరబడి ఉండాల్సిన పోలీస్ స్టేషన్ భవన సముదాయం 18ఏళ్లకే బీటలు వారి స్లాబ్ పెచ్చులు ఊడాయి. అలాగే భవన రేయిలింగ్ శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. అయినా పాలకులు, అధికారులు పట్టించుకోక పోవడం పట్ల పోలీసులు ప్రాణాలను అర చేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో గోడలు నీటికి తడిసిముద్దవుతున్నాయి. ఫలితంగా పోలీస్‌స్టేషన్ భవనం లోన లొటారం, పైన పటారం అన్న చందంగా మారింది. నాణ్యత లేకుండా నిర్మాణం చేపట్టిన పోలీసు స్టేషన్.. బాత్‌రూమ్‌లతో పాటు ఫ్లోరింగ్ కుంగిపోయి అధ్వాన స్థితికి చేరింది. ప్రభుత్వాలు, పాలకులు మారినా.. నిజాంసాగర్ మండల కేంద్రంలో ఉన్న పోలీసుస్టేషన్ భవనం దుస్థితి మాత్రం మారడం లేదు. కనీసం ఇప్పటికైనా పాలకులు, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి.. నిజాంసాగర్ పోలీస్ స్టేషన్ భవన సముదాయంతో పాటు పోలీసు క్వార్టర్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పోలీసు స్టేషన్‌లో ఫ్లోరింగ్‌కు పగుళ్లు ఏర్పడిన దృశ్యం



పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో కూలిన రేయిలింగ్



అధ్వానంగా మారిన పోలీసు స్టేషన్‌లోని బాత్‌రూమ్‌లు

నిర్మించారు.. వదిలేశారు!

ఆంధ్రజ్యోతి పరిశీలన



ఎత్తొండలో వృథాగా మారిన ఆరోగ్య ఉప కేంద్రం



కొత్తపల్లిలో ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య ఉప కేంద్రం

- ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖానాలు
- కరెంట్ కనెక్షన్, తాగునీటి వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు

కోటగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసినా.. వాటికి భవనాలు లేక అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. దీంతో చికిత్సకు వచ్చిన ప్రజలు ఆరోగ్య సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని చోట్ల భవన నిర్మాణాలు చేపట్టినా కనీస వసతులు కల్పించకపోవడంతో అలంకార ప్రాయంగా మారాయి. మరికొన్ని చోట్ల స్థలాలు లేకపోవడంతో భవనాల నిర్మాణ పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని నిర్మించిన పల్లె దవాఖానాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో వృథాగా మారుతున్నాయి. భవన నిర్మాణం పూర్తయి ఏడాది దాటినాకరెంట్ కనెక్షన్, తాగునీటి వసతి వంటి వసతులు కల్పించకపోవడంతో అధికారులు దాట వేసే ధోరణి అవలంబిస్తున్నారు. దీంతో గత ఏడాదిన్నరగా భవనాలు ప్రారంభానికి నోచుకోకగా పోగా.. మరికొన్ని ప్రారంభించిన వసతులు కల్పించకపోవడంతో వృథాగా మారాయి. కోటగిరి ఉమ్మడి మండలంలో 11సబ్ సెంటర్లు ఉన్నాయి. కల్లూర్, సుంకిని, సులేమాన్ నగర్ గ్రామాలలో మాత్రమే సబ్ సెంటర్ల భవనాలు ఉండేవి. గత మూడేళ్ల క్రితం తెలంగాణ ప్రభుత్వ హయాంలో కోటగిరి మండలానికి నాలుగు సబ్ సెంటర్లు మంజూరయ్యాయి. కోటగిరి మండలంలోని ఎత్తొండ, కొత్తపల్లి, పొతంగల్ మండలంలోని దోమలెడ్గి గ్రామాలో సబ్ సెంటర్ల నిర్మాణం పూర్తయింది. ఒక్కో భవనానికి 16 లక్షల రూపాయల చొప్పున నిధులు వెచ్చించారు. ఎత్తొండ భవనం పూర్తి అయి ప్రారంభించినా.. ఫలితం లేకుండా పోయింది. సబ్ సెంటర్‌లో కరెంట్, తాగునీటి వసతి లేకపోవడంతో వినియోగంలోకి రాలేదు. సబ్ సెంటర్‌కు వేసిన తాళం వేసినట్టుగానే ఉండిపోయింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీలో సేవలు అందిస్తున్నారు. దోమలెడ్గిలోనూ భవనం పూర్తయినా వసతులు లేకుండా పోయాయి. గ్రామ పంచాయతీ నుంచి విద్యుత్ సరఫరాను తీసుకుని సెంటర్‌ను వినియోగిస్తున్నారు. ఇక్కడ నీటి వసతి కల్పించలేదు. కొత్తపల్లి గ్రామంలోనూ భవన నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. భవన నిర్మాణం సైతం ఇష్టారాజ్యంగా చేపట్టి మమ అనిపించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనంలో విద్యుత్, ఇతరత్రా వసతులు కల్పించకపోవడం గమనార్హం. నేటికీ సబ్ సెంటర్ల నిర్వహణ అధ్వానంగా కొనసాగుతోంది. కోటగిరి మండల కేంద్రంలోనూ ఆరోగ్య కేంద్ర భవనాలు నిర్మించకపోవడంతో అద్దె భవనం, పంచాయతీ భవనాలలో సేవలు అందిస్తున్నారు. పొతంగల్ మండల కేంద్రంలోనూ ఆరోగ్య ఉప కేంద్రం ప్రైవేటు భవనంలోనే కొనసాగుతోంది. ఇప్పటికైనా ఆరోగ్య కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించడంతో పాటు నిర్మించిన వాటిని సైతం నియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైన ఉంది.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

- అలీమొద్దీన్, వైద్యాధికారి, పొతంగల్



ఆరోగ్య ఉప కేంద్రాల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిర్మించిన వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.

క్రీడా సమాచారం!!



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కోనాసముందర్ ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు

కోనాసముందర్ విద్యార్థుల ఎంపిక

కమ్మర్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాసముందర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అండర్- 14 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్‌ఎం బి.మధుపాల్ పీఈటీ బి.రమేష్ గౌడ్ తెలిపారు. తిర్మన్‌పల్లిలో జరిగిన టోర్నమెంట్‌లో అత్యంత ప్రతిభను కనబర్చిన పాఠశాలకు చెందిన గనాపురం రాజవర్ధిని, కె.నిక్షిత్ కుమార్‌లు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 9,10,11 తేదీలలో కరీంనగర్ లో నిర్వహించే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నస్రీన్‌బేగం, సభ్యులు, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్.. పట్టించుకోని అధికారులు



సిరికొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గల ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయి నాలుగు రోజులైనా.. ట్రాన్స్‌కో అధికారులు స్పందించడం లేదు. ప్రస్తుతం నాట్లు వేస్తున్న తరుణంలో ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోవడంతో మోటార్లు నడవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినప్పటికీ.. స్పందించడం లేదని గ్రామ రైతులు మిట్టపల్లి గంగారెడ్డి, విజయ్, ప్రసాద్, లాజర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

మొరాయించిన రైల్వే గేటు



ఇస్లాంపూర్ రైల్వే గేటు మొరాయించిన దృశ్యం

డిచ్‌పల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇస్లాంపుర రైల్వే గేటు గంట పాటు మొరాయించడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. శనివారం మధ్యాహ్నం ముంబాయి నుంచి గూడూరు వెళ్లే దేవగిరి ఎక్స్‌ప్రెస్ కోసం రైల్వే గేటు వేస్తుండగా.. ఎలక్ట్రానిక్ గేటు మొరాయించింది. దీంతో తాత్కాలిక గేటు ద్వారా రైల్వే సిబ్బంది వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఈ సందర్భంగా రహదారికి ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోవడంతో.. వాహన చోదకులు రైల్వే గేటు సిబ్బందిపై మండి పడ్డారు. రైలు రాకముందు సుమారు గంట పాటు ఎందుకు గేటు వేశారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. రైల్వే సిబ్బంది ఇటీవల ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ సిగ్నల్ పనిచేయక పోవడంతో తరచూ ఇలాంటి సమస్యలు ఎదు రవుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు.

- డిచ్‌పల్లిలో గంట పాటు నిలిచిన ట్రాఫిక్



గంట తర్వాత వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్

ఫోటో న్యూస్



పనిచేయని ఎలక్ట్రానిక్ గేటు



గేటు వేయడంతో నిలిచిన ట్రాఫిక్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న చైర్‌పర్సన్,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు

కామారెడ్డిటౌన్,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):సీఎం రేవంత్‌రెడ్డి,ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ చిత్రపటాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ,జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కౌన్సిలర్ పాకజ్ఞానేశ్వరీలు క్షీరాభిషేకం చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌మాట్లాడుతూ కామారెడ్డి నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించి సీఎం రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు ప్రభుత్వ సలహదారుడు షబ్బీర్‌అలీ కృషిచేస్తున్నారని అన్నారు. కామారెడ్డి మున్సిపాలిటిలో పలు అభివృద్ధికార్యక్రమాలకు రూ.27 కోట్లను షబ్బీర్‌అలీ మంజూరుచేయించారని ఈనిధులతో మున్సిపాలిటిలో పలు అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఉరుదోండవనిత రవి,నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి,కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ



తిమ్మాపూర్‌లో బాధపడుతున్న మురళిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

బీర్కూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఢీకొండ మురళిని శనివారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. మురళి గత రెండు నెలలుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్నఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తిమ్మాపూర్‌లోని మురళీ నివాసానికి చేరుకున్నారు. అనారోగ్యం బారిన పడిన మురళిని ఎమ్మెల్యే పరామర్శించారు. అధైర్య పడొద్దని, అన్ని వేళలా అండగా ఉంటానని మురళికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్పారావు, హన్మంతరావు తదితరులు ఉన్నారు.

వ్యాపార సముదాయాల ప్రారంభం



వ్యాపార సముదాయాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోటలక్ష్మికాంతారావ్

పిట్లం:స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో వాణిజ్య వ్యాపార సముదాయలను శనివారం జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మికాంతారావ్ ప్రారంభించారు. మార్కెట్‌కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన 20 వ్యాపార సముదాయాలను ఎమ్మెల్యే ప్రారంభించి వ్యాపార యజమానులకు తాళాలు అందజేశారు.ఈకార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయమార్కెట్ కమిటీ అధికారిణి రమ్య కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, మోహన్ రెడ్డి, విండో చైర్మెన్ నాగిరెడ్డి, బోడ్లరాజు, పాలక వర్గం సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ పోరుకు కసరత్తు

(3వ పేజీ తరువాయి)

జిల్లాలో గతంలో 526 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగగా కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలతో కలుపుకొని ఈసారి 535 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. ప్రభుత్వం ప్రస్తుతం కుల గణనకు సర్వే చేపట్టింది. ఈ సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీ చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. కుల గణన చేపడుతున్నందున కొత్త రిజర్వేషన్‌లు చేస్తారనే దానిపై పోటీ చేసే ఆశావహుల్లో చర్చ సాగుతోంది. గతంలో ఉన్న రిజర్వేషన్లను రద్దు చేసి కొత్తగా ప్రకటించే అవకాశం ఉందని ఆయా రాజకీయ పార్టీల నాయకులు భావిస్తున్నారు.వచ్చేఏడాది జనవరి 2లేదా మూడో వారంలో నోటిఫికేషన్ ఇచ్చి ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.

ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలి



దేవునిపల్లి పోలీసుస్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన బోర్డు

కామారెడ్డిటౌన్,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజలతో ప్రతీ స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ఫిర్యాదుపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సింధూశర్మ జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌లకు ఆదేశించారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి,బాన్సువాడ డివిజన్ పరిధిలోని ఆయా పోలీసుస్టేషన్‌లో ప్రజలు ఫిర్యాదుచేయాలని అక్కడ తగిన చర్యలు తీసుకోకుంటే సీఐ కార్యాలయంలో అక్కడకూడా తగినవిధంగా చర్యలు లేకుంటే డీఎస్పీ కార్యాలయం, అక్కడ కూడా చర్యలు తీసుకోన్నట్లయితే ఎస్పీ కార్యాలయంలోని సెంట్రల్ కాంప్లెంట్ నంబర్ 8712686142 నంబర్‌కు ఫోన్‌కాల్ ద్వారాగాని వాట్సాప్ ద్వారా గాని సంప్రదించాలని తెలిపారు. ఇందుకోసం ప్రతీ పోలీసుస్టేషన్ ముందు భాగంలో ఒక బోర్డు మీద సంబంధిత అధికారుల ఫోన్‌నంబర్ పొందు పరుచుతూ బోర్డు రూపంలో ఏర్పాటుచేయడం జరిగిందని తెలిపారు.

కాంగ్రెస్ అసమ్మతి, బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

బీర్కూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని జ్యోతి బాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించేందుకు కోసం శనివారం బీజేపీ నాయకులు పాఠశాలకు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే గురుకుల పాఠశాలకు చేరుకుని బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. ఒక నెల వ్యవధిలో మూడు జిల్లాల్లో గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గురుకులాల్లో విద్యార్థులకు నాణమైన భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించేందుకు వెళితే స్థానిక పోలీసులు తమను అక్రమంగా అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అరెస్టు అయిన వాళ్ళ లో బీజేపీ మండల అధ్యక్షుడు సాయి కిరణ్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బీజేపీ నాయకులు హన్మాండ్లు,సాయిబాబా, బస్వరాజు,జగదీష్ తదితరులు ఉన్నారు.

పెద్ద కొడప్‌గల్:జుక్కల్ నియోజక వర్గంలో శనివారం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావ్ పర్యటన ఉండటంతో ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీసులు పెద్ద కొడప్‌గల్, జుక్కల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. పెద్ద కొడప్‌గల్ మండలంలో బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేయగా, జుక్కల్ పోలీస్ పోలీసులు మండలంలో కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి వర్గంగా బావిస్తున్న వారిని ఎలాంటి అలజడులు జరగకుండ ముందస్తుగా అరెస్ట్ చేశారు.



బీర్కూర్‌లో బీజేపీ నాయకులను అరెస్టు చేసిన దృశ్యం

మద్నూర్:ఉమ్మడి మద్నూర్ మండలంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన ఉన్న దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా ఉమ్మడి మద్నూర్ మండలంలోని అసమ్మతి కాంగ్రెస్ నాయకులతో పాటు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశామని ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. తెల్లవారు జామున నాయకుల ఇళ్లకు వెళ్లి అరెస్టు చేసి మద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. మంత్రి కార్యక్రమం ముగిసిన తరువాత వారిని తిరిగి పంపించామని తెలిపారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ మం డల పార్టీ అధ్యక్షుడు తుకారం, కాంగ్రెస్ పార్టీ నుంచి తొలగించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ ఉన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు ఉపాధ్యాయ సంఘ నాయకుల మద్దతు

కామారెడ్డిటౌన్,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని గత రెండురోజులుగా కామారెడ్డి జిల్లాకేంద్రంలోని మున్సిపల్ వద్ద రిలే నిరాహర దీక్ష చేపట్టారు.వీరికి టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్, ఎస్‌సీ,ఎస్‌టీ రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటిలు మద్దతు పలికారు.ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కారిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చి న హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. సమానపనికి సమానవేతనం అందించాలని కాంట్రాక్ట్ ఉ ద్యోగుల పట్ల వెట్టిచాకిరి వైఖరి సరికాదని అ న్నారు. సమగ్ర శిక్షణ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు తాము సం పూర్ణమద్దతు ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగుల రెగ్యులరైజ్,పేస్కేల్ అమ లు, ప్రతీ ఉద్యోగికి రూ.20లక్షల జీవితభీమా, రూ.10లక్షల ఆరోగ్యభీమాసౌకర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘనాయకులు సంగయ్య, పీఆర్టీయూ స్టేట్ అ సోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఉపా ధ్యాక్షుడు, బాబయ్యసమగ్ర దీక్ష ఉద్యోగులు రాములు,సాయిలు,శైలజ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల ఆకస్మికంగా తనిఖీ



కస్తూర్బా విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను శనివారం ఆకస్మికంగా ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందిం. పాఠశాల ప్రత్యేక అధికారి వీణకు సూచించారు. 3.5 కోట్లతో నిర్మి స్తున్న అదనపు గదులు నిర్మాణాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యేతో పాటు మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యేను కలిసినకాంగ్రెస్ నాయకులు

తాడ్వాయి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం నాయకులు మండలంలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఈయన సానుకూలంగా స్పందించి మండలంలోని సమస్యలు పరిష్కారానికి త్వరలోనే కృషి చేస్తానని తెలిపారు. రాబోవు సంస్థ గత ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జూకంటి వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జలంధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవ్, మాజీ ఉప సర్పంచ్ సుధాకర్‌రావు,వీడీసీఅధ్యక్షుడు మేకల రాజు,నాయకులు తదితరులు ఉన్నారు.

బ్రాహ్మణపల్లిలో ముస్తాబైన అంజనాద్రి

నిజాంసాగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లి అంజనాద్రి దేవాలయ సప్తమ వార్షికోత్సవ మహోత్సవ కార్యక్రమాలు నేటి నుంచి (ఆదివారం) నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అభయాంజనేయ స్వామి ఏకశిలా పంచాయతీన సహిత విగ్రహ సప్తమ వార్షికోత్సవానికి నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. అంజనాద్రి దేవాలయాలలో ఉన్న ఏకశిలా విగ్రహానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో స్వస్తశ్రీ శాలివాహన శక 1946 ప్రవర్తన మానే శ్రీ కోతి నామ సంవత్సర మార్గశిర శుద్ధి సప్తమి ఆదివారం నాడు ఏడవ వార్షికోత్సవ మీ పురస్కరించుకొని అభయాంజ నేయ స్వామి ఏకశిలా విగ్రహ సహిత సఫారిబాల సపరివార దేవతలకు ఉదయము ఎనిమిది గంటలకు మహాభిషేకంతో పాటు 108 నది జనాలతో అభిషేకం, మూలమంత్ర హావనము, లక్ష తమలపాకులతో శ్రీ ఆంజనేయ స్వామి వారికి అర్చన శివుని లక్ష ప్రతి పుష్ప దవరాలతో అర్చన పూర్ణహౌతి మంగళ హారతి తీర్థ ప్రసాదములు మహా ఆశీర్వచనంతో పాటు అన్నదాన ప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని అంజనాద్రి క్షేత్రం బ్రాహ్మణపల్లి శివారులో



అంజనాద్రి ఆలయ ఆవరణను ముస్తాబు చేసిన దృశ్యం

నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు పి. సునీత కిషోర్ కుమార్లు తెలిపారు. సప్తమ వార్షికోత్సవ మహోత్సవానికి గ్రామాల ప్రముఖులు, అంజనాద్రి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు ప్రజాప్రతినిధులు కూడా ఆహ్వానించడం జరుగుతుందని ఆయన తెలిపారు. శ్రీ అభయాంజనేయ స్వామి సప్త వార్షికోత్సవ మహోత్సవానికి అందరూ విచ్చేసి విజయవంతం చేసి స్వామి అనుగ్రహం పొందాలని కిషోర్ కుమార్ తెలిపారు.

ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రాస్తారోకో

నవీపేట,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో శనివారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ ఆటోడ్రైవర్‌కు సంవత్సరానికి రూ.12వేలను అందించాలని, ఆర్టీసీ బస్సుల లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వంటవార్పు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితా పక్కాగా నిర్వహించాలి

సదాశివనగర్,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేను జాగ్రత్తగా చేపట్టాలని తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు.దీనికోసం లబ్దిదారుల ఎంపికకు ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం లబ్దిదారులను ఎంపికచేయాలని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలకు ఎవరు పాల్పడిన వారే బాధ్యులు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'అస్తవ్యస్తంగా కాంగ్రెస్ పాలన'

నసురుల్లాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అగమ్య గోచరంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలన నడుస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు శనివారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించడానికి వచ్చిన బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు.. దీంతో గురుకుల పాఠశాల గేటు ముందు బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ మాట్లాడుతూ వసతి గృహలలోని వైఫల్యాలను కప్పిపుచ్చుకోవటానికి పోలీసులు అడుగడుగునా తమను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అనుమతి లేకుండా గురుకులాల్లో ప్రవేశించ కూడదని పోలీసులు అరెస్టు చేసి వారిని స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అఫ్రోజ్, నరసింహులు గౌడ్, టేకుర్ల సాయిలు, డి సాయిలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

పెద్ద కొడప్‌గల్, డిసెంబరు 7: సీఎం కప్ క్రీడా పోటీలను పురస్కరించుకుని మండలంలోని పెద్ద కొడప్‌గల్ ఉన్నత పాఠశాలలో పోటీలను ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు గాను ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు క్రీడా పోటీలు ప్రారంభించినట్లు తెలిపారు. శనివారం మండలం లోని ఆయా గ్రామాల పాఠశాలస్థాయిలో ఈ పోటీలు నిర్వహించగా ఇందులో విజేత లుగా నిలిచిన వారికి ఈ నెల 11 మరియు 12 తేదిలలో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సీఎం క్రీడా పోటీలలో భాగంగా విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, యోగా, ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్ ఈ ఆరు అంశాలలో పోటీలు నిర్వ హిస్తామని తెలి పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు కమ ల, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్,పిఈటి జ్యోతి పాల్గొన్నారు.

రామారెడ్డి: సీఎం రేవంత్‌రెడ్డి 2024 గేమ్స్ అండ్ పోటీలు రామారెడ్డి మండల రెడ్డిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, క్రీడలు నిర్వహిం చారు. అందులో వాలీ బాల్ పోటీల్లో మూడు టీమ్‌లు కబడ్డీ పోటీల్లో మూడు టీమ్‌లు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడా కారులకు బహుమ తులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపేట్ వీడీసీ అధ్యక్షుడు లక్కాకుల నర సింహులు, ఉపాధ్యక్షులు రాజు, కార్యదర్శి సతీష్, సభ్యులు లింబాద్రి, హెచ్‌ఎంలు గోపాల్‌రెడ్డి, మాజీ పాఠశాల చైర్మన్ మామిండ్ల పాల్గొన్నారు. తాడ్వాయిలో సీఎంకప్పును ప్రారంభించిన మండల కాంగ్రెస్ నాయకులు

తాడ్వాయి:మండలంలోని వివిధ గ్రామాలలో ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం సీఎం కప్ క్రీడలను వివిధ గ్రామాల్లో మండల కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కప్పు ద్వారా గ్రామాల్లో మెరుగైన క్రీడాకారులను వెలికితీసే విధంగా ఉపయోగపడుతుందని వారన్నారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ నాయకుడు జలంధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మేకల రాజు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఉరేసుకొని మహిళ మృతి

పిట్లం డిసెంబరు 7:మండలంలోని కంబాపూర్‌లో ఉరేసుకొని మహిళ మృతి చెందిన సంఘటన జరిగింది.కంబాపూర్ గ్రామానికి చెందిన మీణ(25)ఇంట్లో తగాదాలతో ఉరి వెసుకొని మృతి చెందడం జరిగిందని ఎస్సై రాజు తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంబాపూర్ గ్రామా నికిచెందిన మీనా వృత్తి వ్యవసాయం,శుక్రవారం 6 నాడు రాత్రి సుమారుగా 9 గంటల సమయంలో తన భర్త అయిన సాయిలుతో కుటంబవిషయాలలో గొడవ జరగగా 7వ తేదీనాడు ఉదయం 11గంటల సమ యం లో ఇంట్లో ఎవరు లేనిది చూసి ఉరేసుకొని చనిపోయిందని, మృతురాలి తల్లి అంజవ్వ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.మృతురాలికి ఒక కొడుకు, ఒక కూ తురు ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ఎల్లారెడ్డి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎల్లారెడ్డి మండలం వెల్లుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం వెల్లుట్ల గ్రామానికి చెందిన యామ గంగారాం (46) కొన్ని రోజుల క్రితం తన కూతురికి పెళ్లి చేసి కొంత స్థలం కొనుగోలు చేశాడు. నెల రోజుల క్రితం తన కూతురు ఇంటికి రాగా ఈ నెల 6వ తేదీన ఆమెను తన అత్త గారిఇంటి వద్ద విడిచిపెట్టి వద్దామని గంగారాం భార్య వెళ్లగా ఇంట్లో ఎవరూ లేనిది చూసి అప్పుల బాధతో అప్పులు తీర్చలేను అని జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకొని చనిపోయాడు అని గంగారాం బార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.. మృతునికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.

భిక్కనూరులో పోలీసుల 2 కే రన్

భిక్కనూరు,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):రాజంపేట,దోమకొండ, బీబీపేట పోలీసుసిబ్బంది శనివారం తెల్లవారుజామున 2.5 కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తమ సర్కిల్ పరిధిలోని 4 పోలీసుస్టేషన్‌లలో గల అన్ని ర్యాంకుల 80 మంది సిబ్బంది, సౌత్ క్యాంపస్ విద్యార్థులతో కలిసి వేక్‌అప్ వింటర్ అనే నినాదంతో దోమకొండ మండలం లింగుపల్లి చౌరస్తా నుండి భిక్కనూరు మండలంలోని బీటీఎస్‌చౌరస్తాలో గల సౌత్‌క్యాంపస్ వరకు ఈ రన్ నిర్వహించినట్లు తెలిపారు.ఈ రన్‌కు డీఎస్పీ నాగేశ్వర్‌రావు హాజరై సిబ్బందిని ఉత్సహపరిచారు. ఈ కార్యక్రమంలోఅన్ని పోలీసుస్టేషన్ల ఎస్‌ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బాన్సువాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆయన నివాసంలో శనివారం సాయంత్రం బాన్సువాడ నియోజకవర్గంలోని 108 మంది లబ్దిదారులకు రూ.34,47,500 చెక్కులను ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్దిదారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లోన్ పేరుతో మోసం

● కేసు నమోదు

ఎల్లారెడ్డి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల కేంద్రానికి చెందిన ఉప్పరి పండరికి ఈ నెల 5వ తేదిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి నీకు ధని ఫైనాన్స్ నుంచి లోన్ మంజూరు అయ్యిందని లోన్ కావాలంటే సంబంధిత డాక్యుమెంట్స్‌తో పాటు కొంత ఫీజు కట్టాల్సి ఉంటుందని తెలుపగా పండరి అది నమ్మి అట్టి గుర్తు తెలియని వ్యక్తికి మొత్తం 42,025 రూపాయలు పంపాడు. అయిన కూడా మరిన్ని డబ్బులు పంపమని వేధించటంతో పండరి మోసపోయానని గ్రహించి ఎల్లారెడ్డి పోలీసులకు దరఖాస్తు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి ఒకరిమృతి

రాజంపేట,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమడ్ల గ్రామ రైల్వేస్టేషన్‌సమీపంలో శనివారం మండలంలోనిఆరెపల్లి గ్రామానికి చెందిన నుల్గొండ శ్రీనివాస్(45) రైలు కింద పడి మృతిచెందాడు. స్టేషన్ మాస్టర్ రైల్వే పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదుచేశారు. మృతునికి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతికిగల కారణాలు త్వరలోనే వెల్లడిస్తామని రైల్వేపోలీసులు తెలిపారు.

ప్రకటన

సమస్త ప్రజలకు తెలియజేయునది నాయొక్క క్లయింటు శ్రీ కర్రయ్యగారి దేవరాజు S/o.మల్లయ్య R/o.H.No1-86/1, భవానిపేట గ్రామం, మాచారెడ్డి మండలం, కామారెడ్డి జిల్లా గారి యొక్క క్రింది షెడ్యూలు ఆస్థికి సంబంధించిన లింకు డాక్యుమెంట్ రిజిష్టరు విక్రయపత్రము నంబరు 2863/2022, SRO దోమకొండ, దోమకొండలో పోయినది. కావున క్రింది షెడ్యూలు ఆస్థికి సంబంధించి మరియు ఫైలింగు డాక్యుమెంట్‌కు సంబంధించి ఎలాంటి ఆక్షేపణలు, హక్కులు కలిగియున్న క్రింది అడ్రస్‌లో అన్ని ఆధారములతో (7) రోజులలోపు సంప్రదించగలరు. తరువాత వచ్చిన ఎలాంటి ఆక్షేపణలు చెల్లనేరవు.

షెడ్యూలు ఆస్థి :

G.P.H.No1-107, యొక్క ఖాళీ స్థలము విస్తీర్ణము మొత్తం 22-0 చ.గజములు, దీనియొక్క హద్దులు: ఉత్తరం: ఎం.ఎల్లవ్వ యొక్క ఖాళీ స్థలము, దక్షిణం: జి.పి.రోడ్, తూర్పు: ఎం.స్వామి యొక్క ఇల్లు, పడమర: ఎల్.శంకర్ యొక్క ఖాళీ స్థలము

మరియు

G.P.H.No1-107/A, యొక్క ఖాళీ స్థలము విస్తీర్ణము మొత్తం 180-0 చ.గజములు, దీనియొక్క హద్దులు: ఉత్తరం: కాలువ, దక్షిణం: ఎల్.శంకర్‌యొక్క నివాస స్థలం, తూర్పు: ఎం. ఎల్లవ్వ యొక్క ఖాళీ స్థలం మరియు కె. ఎల్లవ్వ యొక్క G.P.H.No1-107, ఖాళీ స్థలం, పడమర: ఎల్.శంకర్ యొక్క ఖాళీ స్థలము. G.P.గొట్టిముక్కుల (సీతారాంపూర్) గ్రామము, దోమకొండ మండలము, కామారెడ్డి జిల్లాలో కలదు.

సం/- **వి. లక్ష్మణ్‌రావు** అడ్వకేట్ నోటరి
ఇ.నెం. 5-3-991/5, విద్యానగర్, కామారెడ్డి.
సెల్ : 9959298343

గ్రంథాలయాలను యువకులు సద్వినియోగం చేసుకోవాలి

రామారెడ్డి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యువకులు గ్రంధాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రామారెడ్డిమం డల కేంద్రంలో గ్రంధాలయ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లోనే గ్రంధాల యం రూపు రేఖలు మార్చి పెయింట్ వేసి ప్రశాం తమైన వాతావరణంలో యువకులు చదువుకునే విధంగా మార్చివేశారు. గత 10 సంవత్సరాల నుంచి భవనంకి కనీస వసతులు లేకుండా ఉందని ఆకస్మిక తనిఖీ చేయగానే కేవలం రెండు రోజుల్లో చొరవ తీసుకని వసతుల కల్పనకు కృషి చేశారు.



రామారెడ్డి గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

చదువుకోవడానికి కావాల్సిన పుస్తకాలను కూడా అందుబాటులో ఉండే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దర్శిశ్రీ, వంశీ కృష్ణ, గ్రంధాలయ సిబ్బంది, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌స్కూల్ స్పెషల్ అడ్మిషన్ డ్రైవ్

రాజంపేట,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):రాజంపేట మండలంలోని ఆర్గొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఓపెన్ స్కూల్ స్పెషల్ అడ్మిషన్ డ్రైవ్‌లో గోడప్రతులను ఎంఈవో పూర్ణచందర్‌రావు ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ స్పెషల్ అడ్మిషన్‌లనుచేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ తులరవీందర్, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

